క్లుప్తంగా

పారిజాతగిరి వెంకన్నకు విశేష పూజలు

జంగారెడ్డిగూడెం: గోకుల తిరుమల పారిజాత గిరి వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం కావడంతో విశేష పూజలు నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, తోమాల సేవ, ఆరాధన, బాల భోగ నివేదన తదితర పూజలు చేశారు. జంగారెడ్డిగూడెం విద్యుత్ శాఖ ఈఈ పోతుసూరు రాధాకృష్ణ కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు.

విద్యార్థులకు బహుమతులు



హిందీ భాష ఔన్నత్యంపై ప్రదర్శన ఇస్తున్న విద్యార్థులు

కొయ్యలగూడెం: హిందీ భాషా వారోత్సవాల ముగింపు కార్యక్రమం శనివారం అపోలో స్కూల్లో నిర్వహించారు. ఈనెల 14వ తేదీన ప్రారంభమైన వారోత్సవాల్లో భాగంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు వక్తృత్వ, వ్యాస రచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు హిందీ భాష ఔన్నత్యాన్ని గురించి సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో నాటికలు నిర్వహించారు. చైర్‌పర్సన్ ఆర్ శ్రీవిద్య, కరస్పాండెంట్ ఆర్ ప్రవీణ్‌కుమార్, హిందీ భాషా పండితులు పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై అవగాహన



పోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

టి.నరసాపురం: చట్టాలపై అవగాహన ఉన్నప్పుడే రక్షణ మార్గాలు తెలుస్తాయని ఎస్సై ఎం జయబాబు అన్నారు. మండలంలోని మర్రిగూడెం ఆశ్రమ గిరిజన సంక్షేమ బాలికల వసతి గృహంలో విద్యార్థులకు పోక్సో, వివిధ చట్టాలపై అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ విద్యార్థులు, ముఖ్యంగా బాలికల రక్షణ కోసం ప్రభుత్వం అనేక చట్టాలు చేసిందన్నారు. వాటిలో పోక్సో చట్టం ఒకటన్నారు. ఈ చట్టం ద్వారా బాలబాలికలకు రక్షణ కలుగుతుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ పోక్సో చట్టంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. బాలికలు గుడ్ టచ్ బాడ్ టచ్ గురించి తెలుసుకోవాలని సూచించారు. విద్యలో రాణించాలన్నారు. ఆయన వెంట ఏఎస్సై వి.జయకుమార్ ఉన్నారు.

మహోదరునికి మహా నైవేద్యం



మహోదరునికి సమర్పించిన మహా నైవేద్యం

కొయ్యలగూడెం: వినాయక చవితి మహోత్సవాల్లో భాగంగా కొయ్యలగూడెం కోపరేటివ్ బ్యాంకు వీధిలో నెలకొల్పిన మహోదరునికి (గణపతి) మహా నైవేద్యం సమర్పించారు. మండలంలోనే అతిపెద్ద గణపతి విగ్రహం అయిన స్వామి వారి ఎదుట నైవేద్యంగా 120 రకాల పిండి వంటలను ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం నుంచి రెండు వేల మందికి పైగా భక్తులకు అన్న సమారాధన ఏర్పాటు చేశారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేకంగా తమ ఇళ్ల వద్ద తయారు చేసిన పిండి వంటలను తీసుకొచ్చి మహోదరుని వద్ద ఉంచి పూజలు చేసి, పారాయణాది కార్యక్రమాలు నిర్వహించారు. సంకష్టహర చతుర్థి రోజున స్వామి వారిని కొలిచిన వారికి సమస్యలు తీరుతాయని భక్తులకు అర్చకులు అనుగ్రహ అనుగ్రహ భాషణ చేశారు.

సెల్‌ఫోన్ దొంగల హల్‌చల్

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో సెల్‌ఫోన్ చోరీలు పెరిగిపోతున్నాయి. గతంలో బస్టాండ్‌లో, రైల్వేస్టేషన్‌లో, రైతుబజార్ల వద్ద రద్దీ ప్రదేశాల్లో సెల్‌ఫోన్లు చోరీకి గురయ్యేవి. తాజాగా 'మీ వస్తువులు పడిపోయాయి' అంటూ చెబుతూ అవి చూసేలోపే జేబులో నుంచి ఫోన్లు కాజేస్తున్నారు. శనివారం ఏలూరు డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయ ఉద్యోగి లోనికి వెళుతుండగా ఇద్దరు యువకులు అక్కడ కాపుకాచి ఆయనతో మాట్లాడారు. ఇక్కడ ఏదో వస్తువు కింద పడిపోయిందని చెప్పారు. ఆ ఉద్యోగి కిందకు చూస్తుండగానే జేబులోనుంచి సెల్‌ఫోన్‌ను తీసుకుని మోటారుసైకిల్‌పై ఇద్దరు పరారయ్యారు. ఇదే తరహాలో ఏలూరులో మరోచోట సెల్‌ఫోన్ చోరీ చేసినట్టు పోలీసులు చెబుతున్నారు.

మెట్ట పొలాలకు ఏటా ముంపే

- నెరవేరని బైనేరు వాగుపై అక్విడెక్ట్ లక్ష్యం
- జలాశయం డ్రాఫ్ట్ వద్ద చేపట్టని గట్టు పునరుద్ధరణ పనులు



వెంకట రామానుజపురంలో బైనేరు వాగుపై కూలిన అక్విడెక్ట్



కొంగువారిగూడెం కేకేఎం ఎర్రకాలువ జలాశయం డ్రాఫ్ట్ వద్ద గట్టు కొట్టుకుపోవడంతో రైతుల పొలాలను ముంచెత్తిన వరద నీరు

జంగారెడ్డిగూడెం రూరల్: ఏటా ఎర్రకాలువ నీటి ముంపుతో మెట్ట ప్రాంత రైతాంగం ఇబ్బందులు ఎదుర్కొంటుంది. బైనేరు వాగుపై నిర్మించిన అక్విడెక్ట్ మొదటి ఫిల్లర్ వరద నీటి ఉధృతితో కోతకు గురై నీటి తొట్టెలు కాలువలోకి కూలిపోవడంతో సాగునీటికి ఎదురుచూడాల్సి వస్తుంది. తమ సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

పొలాలను ముంచుతున్న వరద

జిల్లాలోనే మధ్యతరహా ప్రాజెక్టుగా పేరున్న జంగారెడ్డిగూడెం మండలంలోని కొంగువారిగూడెం శ్రీకరాటం కృష్ణమూర్తి ఎర్రకాలువ జలాశయం ప్రధాన కాలువ డ్రాఫ్ట్ వద్ద గట్టు గతంలో కొట్టుకుపోయింది. దీంతో ఏటా డ్యాం నుంచి నీరు విడుదల చేసిన సమయాల్లో రైతుల పొలాలను ముంచెత్తుతుంది. పుట్లగట్లగూడెం, దేవులపల్లి, లక్కవరం గ్రామాల వరకు నీరు చేరి పొలాలు ముంపు బారిన పడుతున్నాయి. ఇప్పటికే అనేకమార్లు అధికారులు దృష్టికి సమస్యను తీసుకెళ్లినట్టు రైతులు చెబుతున్నారు. నిధులు కేటాయించి గట్టు నిర్మాణ పనులు చేపట్టాలని వారు కోరుతున్నారు. వరదలు వస్తున్నాయంటే చాలు కంటి మీద కునుకు లేకుండా పోతోందని రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. రైతుల సమస్యలపై ఇరిగేషన్ డీఈ రాంబాబును వివరణ కోరగా అక్విడెక్ట్ పనులకు రూ.5 కోట్లు, ఎర్రకాలువ డ్రాఫ్ట్ వద్ద గట్టు నిర్మాణానికి రూ.4 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని, నిధులు విడుదల కావాల్సి ఉందని తెలిపారు.

అక్విడెక్ట్ పనులపై నిర్లక్ష్యం

జంగారెడ్డిగూడెం మండలం వెంకట రామానుజపురం బైనేరు వాగుపై నిర్మించిన అక్విడెక్ట్ కూలిపోవడంతో రైతులకు సాగునీరు అందించాలనే లక్ష్యం నీరుగారింది. కొంగువారిగూడెం శ్రీ కరాటం కృష్ణమూర్తి ఎర్రకాలువ జలాశయం ఎడమ కాలువ నుంచి అక్విడెక్ట్ మీదుగా ఇతర చానళ్ల ద్వారా తిరుమలాపురంలోని తామర చెరువు, కేతవరంలోని వెంకటేశు చెరువులకు నీరు మళ్లించి తిరుమలాపురం, పేరంపేట, వెంకట రామానుజపురం, కేతవరం గ్రామాలకు 3,800 ఎకరాలకు సాగునీరు అందించడం లక్ష్యం. గతంలో సంభవించిన వరదలకు బైనేరు వాగుపై నిర్మించిన అక్విడెక్ట్ మొదటి ఫిల్లర్ వరద నీటి ఉధృతితో కోతకు గురై విరిగిపోయింది. ఈ ఫిల్లర్‌పై సపోర్టుగా ఉన్న నీటి తొట్టెలు రెండూ కాలువలోకి కూలిపోయాయి. 40 మీటర్ల మేర అక్విడెక్ట్ నిర్మాణం వాగులోకి ఒరిగిపోయింది. దీంతో సాగునీరు అందించాలనే లక్ష్యంగా ఆగిపోయింది. అక్విడెక్ట్ పనులకు నిధులు విడుదల చేసి పనులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

లక్ష్యం నెరవేర్చాలి



ఎర్రకాలువ నుంచి రైతులకు సాగునీటిని అందించాలనే లక్ష్యంతో నిర్మించిన అక్విడెక్ట్ ఫిల్లర్ వరదలకు కోతకు గురై నీటి తొట్టెలు కూలిపోయాయి. రైతుల అవసరాన్ని దృష్టిలో పెట్టుకుని నిధులు కేటాయించి, పనులు పూర్తి చేసి, లక్ష్యాన్ని నెరవేర్చాలి.

– రాజులపాటి అన్నవరం, తిరుమలాపురం

స్పెషల్ ఆఫీసర్ల నియామకం

కొయ్యలగూడెం: పోలవరం నియోజకవర్గంలోని ప్రతి మండలానికి స్పెషల్ ఆఫీసర్లను నియమించినట్టు ఎంపీడీఓ ఆర్ బేబీశ్రీలక్ష్మి శనివారం తెలిపారు. కొయ్యలగూడెం మండలానికి స్పెషల్ ఆఫీసర్‌గా డీఎల్‌డీఓ ఎం.రాజు, బుట్టాయిగూడానికి ట్రైబల్ వెల్ఫేర్ శాఖ ఈఈ, పోలవరానికి ఎస్‌డీసీ విజిలెన్స్, టి.నరసాపురం డిస్ట్రిక్ట్ కోఆపరేటివ్ ఆఫీసర్, కుకునూరుకు ఏడీ అగ్రికల్చర్, వేలేరుపాడుకు ఐటీడీఏ ఏపీఓ, జీలుగుమిల్లికి జంగారెడ్డిగూడెం డీఎల్‌డీఓలను ప్రత్యేక అధికారులుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయినట్టు పేర్కొన్నారు.

యువకుడికి గాయాలు

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని తాడువాయిలో ఆగి ఉన్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ఘటనలో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. జీలుగుమిల్లి మండలం టి.గంగన్నగూడెం గ్రామానికి చెందిన తాటి ప్రవీణ్ కుమార్ మంగళవారం తన ద్విచక్ర వాహనంపై జంగారెడ్డిగూడెం బయలుదేరాడు. తాడువాయిలో రోడ్డు పక్కన ఆగి ఉన్న టీవీఎస్ ఎక్స్‌ఎల్ వాహనాన్ని ఢీకొట్టి కింద పడిపోయాడు. దీంతో ప్రవీణ్ కుమార్ తలకు తీవ్ర గాయమైంది. క్షతగాత్రుడిని జంగారెడ్డిగూడెం ఎస్సై జబీర్ జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం స్థానిక వైద్యులు ఏలూరు రిఫర్ చేశారు.

లంబాడ సంక్షేమ సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శుల ఎన్నిక



గుగ్గులోతు కృష్ణా నాయక్



ధారావతు రాజాబాబు నాయక్

చింతలపూడి: ఎస్టీ బంజారా సుగాలి (లంబాడ) సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా గుగ్గులోతు కృష్ణా నాయక్, ప్రధాన కార్యదర్శిగా ధారావతు రాజాబాబు నాయక్ ఎన్నికయ్యారు. శనివారం నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో లంబాడ గిరిజనులకు సరైన గుర్తింపు లభించడం లేదన్నారు. రాజకీయంగా అసెంబ్లీ, శాసన మండలిలో లంబాడా గిరిజనులకు ప్రాతినిధ్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తండాలను ప్రత్యేక పంచాయతీలుగా గుర్తించాలని, ఫిబ్రవరి 14న సేవాలాల్ జయంతిని ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటించాలని కోరారు.

మేడవరపు అశోక్‌కు నివాళి



అశోక్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి తదితరులు

జంగారెడ్డిగూడెం: నిబద్ధత, చిత్తశుద్ధికి నిలువుటద్దం మేడవరపు అశోక్ శ్రీనివాస్ అని మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి అన్నారు. ఇటీవల మృతి చెందిన కామవరపుకోట మండలం కళ్లచెరువుకు చెందిన వైఎస్సార్ సీపీ నేత మేడవరపు అశోక్ శ్రీనివాస్‌కి జంగారెడ్డిగూడెం మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు నివాళులర్పించారు. శనివారం అశోక్ నివాసానికి వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా బత్తిన లక్ష్మి మాట్లాడుతూ అశోక్ శ్రీనివాస్ వైఎస్సార్ సీపీ అభివృద్ధికి ఒక యోధుడిలా కృషి చేశారని గుర్తుచేసుకున్నారు. ఆయన లేని లోటు పార్టీకి తీరని లోటన్నారు. పార్టీ పట్టణాధ్యక్షుడు చిటికెల అచ్యుత రామయ్య, వైస్ చైర్మన్లు ముప్పిడి వీరాంజనేయులు, కంచర్ల వాసవీరత్నం, కౌన్సిలర్‌లు ఉగ్గం దుర్గాప్రసాద్, నేకూరి కిషోర్, కనుమూరి లావణ్య, లోకవరపు వెంకటేశ్వరరావు, కంచర్ల గీత, నాయకులు బత్తిన చిన్న, కంచర్ల విష్ణు, పెసరగంటి త్రిమూర్తులు, చింత అనిల్, చిప్పాడ వెంకన్న తదితరులు అశోక్‌కు నివాళులర్పించారు.

శరన్నవరాత్రి ఆహ్వాన కరపత్రం విడుదల



శరన్నవరాత్రి ఆహ్వాన కరపత్రం విడుదల చేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: స్థానిక విజయదుర్గమ్మవారి ద్వితీయ శరన్నవరాత్రి మహోత్సవ ఆహ్వాన కర పత్రాన్ని ఆలయ ప్రాంగణంలో ఆలయ శాశ్వత కమిటీ చైర్మన్ మారిశెట్టి రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి మాడా రామమోహనరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు చిన్ని రామ సత్యనారాయణ, సింహాద్రి మొబైల్ వరల్డ్ సెల్ షాప్ అధినేత మద్దుల రాంబాబు విడుదల చేశారు. ఈ సందర్భంగా బ్రహ్మశ్రీ ఈమని శశికుమార్ మాట్లాడుతూ అక్టోబర్ 3 నుంచి 14 వరకు శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అమ్మవారు అక్టోబర్ 3న బాలా త్రిపుర సుందరి అమ్మవారి అలంకరణలో దర్శనమిస్తారని, ఉదయం ఆరు గంటలకు కలిశాలతో గ్రామోత్సవం ఉంటుందని తెలిపారు. 4న గాయత్రీ దేవిగా, 5న అన్నపూర్ణ అమ్మవారిగా, 6న లలితా త్రిపుర సుందరి అమ్మవారిగా, 7న మహా చండీ దేవిగా, 8న మహాలక్ష్మీ దేవిగా, 9న శ్రీ సరస్వతి దేవిగా, 10న శ్రీ దేవి అమ్మవారిగా, 11న మహిషాసుర మర్దిని దేవిగా, 12 శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారన్నారు. నిత్యం లలితా సహస్ర నామ పారాయణ, సంగీత సంకీర్తనలు, కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని తెలిపారు. 14న ఉదయం మహా అన్న సమారాధన, సాయంత్రం నాలుగు గంటలకు గ్రామోత్సవం ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో కేఎల్ఎన్ ధనకుమార్, రామిశెట్టి శ్రీనివాసరావు, గుడిమెట్ల యుగంధర్, వందనపు అప్పలరాజు, యర్రం ఉదయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంపై అవగాహన అవసరం



డిగ్రీ కళాశాలలో రక్తదానంపై అవగాహన సదస్సు

జంగారెడ్డిగూడెం: ప్రతి ఒక్కరూ రక్తదానంపై అవగాహన కలిగి ఉండాలని, రక్తం దానం చేయడానికి ముందుకు రావాలని స్థానిక ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ ఆర్ఎంఓ డాక్టర్ వి.రాంబాబు అన్నారు. స్థానిక ఛత్రపతి శివాజీ త్రి శత జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.ప్రసాద్ బాబు అధ్యక్షతన శనివారం ఏర్పాటుచేసిన రక్తదానంపై అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రక్తదానం ఇవ్వడం వల్ల వేరే వారికి జన్మనిచ్చినట్టే అవుతుందని చెప్పారు. ప్రతి 120 రోజులకు ఒకసారి రక్తాన్ని శుద్ధి చేసుకోవచ్చని, అది రక్తదానం వలనే సాధ్యమవుతుందని వివరించారు. ప్రిన్సిపాల్ ఎన్ ప్రసాద్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరావు మాట్లాడారు. కళాశాల రెడ్ రిబ్బన్ క్లబ్ కోఆర్డినేటర్ వి.హనుమంతరావు, కళాశాల అధ్యాపకులు జి.శ్రీనివాసరావు, జి.వెంకట్‌లాల్, ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సామాజిక మార్పునకు కృషి చేసిన గురజాడ



గురజాడ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

కామవరపుకోట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో వైస్ ప్రిన్సిపాల్ జి.శ్రీనివాసరావు అధ్యక్షతన శనివారం గురజాడ అప్పారావు జయంతి ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు మాట్లాడుతూ గొప్ప అభ్యుదయ కవి, సాహితీవేత గురజాడ అప్పారావు అని, సామాజిక మార్పు కోసం ఎంతో కృషి చేశారని కన్యాశుల్కం అనే గొప్ప నాటకాన్ని రచించడమే కాకుండా, సామాజిక దురాచారాల నిర్మూలనకు, తెలుగు సాహిత్య రంగానికి ఎంతో కృషి చేశారని సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఎం ఉషారాణి, కె.ఇందిరాకుమారి, పి.ఏడుకొండలు, విజయ్ కృష్ణ, ఉమ పాల్గొన్నారు.

మహాకవి గురజాడకు నివాళి

కొయ్యలగూడెం: స్థానిక శాఖ గ్రంథాలయంలో మహాకవి గురజాడ అప్పారావు 162వ జయంతి కార్యక్రమం శనివారం నిర్వహించారు. గురజాడ అనగానే కన్యాశుల్కం, బాల్యవివాహాలు నిర్మూలన వంటి సాంఘిక దురాచారాలను ఎదిరించిన వ్యక్తిగా ప్రజలకు గుర్తుకు వస్తారని లైబ్రేరియన్ యు.రాముడు అన్నారు. గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేసి చిన్నారులు నివాళులర్పించారు.

భక్తులతో కిటకిటలాడిన శ్రీవారి క్షేత్రం



శ్రీవారి దర్శనార్థం క్యూలైన్‌లలో వేచి ఉన్న భక్తులు

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలో శనివారం భక్తులు పోటెత్తారు. స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో సుదూర ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు ఆలయానికి తరలివచ్చారు. క్షేత్ర పరిసరాలు కళకళలాడాయి. ఆలయ తూర్పురాజగోపుర ప్రాంతంలోని వైకుంఠం క్యూ కాంప్లెక్స్, దర్శనం క్యూలైన్లు, ప్రసాదం, టికెట్ కౌంటర్లు, కేశఖండనశాల ఇతర విభాగాలు భక్తులతో కిక్కిరిశాయి. ఆలయ ఆవరణలో పలు భజన మండలి సభ్యులు ప్రదర్శించిన కోలాట నృత్యాలు చూపరులను అలరించాయి. సాయంత్రం వరకు క్షేత్రంలో భక్తుల రద్దీ కొనసాగింది.

భారీ అన్నసమారాధన



ద్వారకాతిరుమలలో నిర్వహిస్తున్న అన్నసమారాధన

ద్వారకాతిరుమల: గణేష్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని స్థానిక గ్రంథాలయ సమీపంలో శ్రీ విఘ్నేశ్వర కమిటీ ఆధ్వర్యంలో శనివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. తొలుత కమిటీ సభ్యులు గణనాథునికి విశేష పూజలు నిర్వహించి, నివేదనలను సమర్పించారు. అనంతరం అన్నసమారాధనను ప్రారంభించారు. వేలాది మంది భక్తులు ఇందులో పాల్గొని స్వామివారి అన్నప్రసాదాన్ని భక్తి ప్రపత్తులతో స్వీకరించారు.

బాలరాజు పరామర్శలు



వెంకటేశ్వర్లు కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న బాలరాజు



గోకా చిట్టిరాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బాలరాజు

పోలవరం రూరల్: ఇటీవల మృతిచెందిన వైఎస్సార్‌సీపీ శ్రేణుల కుటుంబాలను శనివారం పోలవరం మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పరామర్శించారు. పోలవరానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు గోక చిట్టిరాజు, పాతాళ వెంకటేశ్వర్లు కుటుంబాలను బాలరాజు పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు. అనంతరం వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా కుటుంబాలకు పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో బాలరాజు వెంట వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బుగ్గా మురళీకృష్ణ, నాయకులు సుంకర అంజిబాబు, బండారు అప్పారావు, సుంకర కొండబాబు, కాశీ రాము, పాడుం శ్యామ్, ఈదురుపల్లి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతా హీ సేవపై కళా ప్రదర్శనలు



జంగారెడ్డిగూడెంలో స్వచ్ఛతా హీ సేవపై అవగాహన కల్పిస్తున్న కళాజాత సభ్యులు

జంగారెడ్డిగూడెం: ఏలూరు కాలుష్య నియంత్రణ మండలి రీజనల్ కార్యాలయం ఆదేశాల మేరకు జంగారెడ్డిగూడెంలో శ్రీదివ్య కళాజాత బృందం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పారిశుద్ధ్యం, పరిసరాల పరిశుభ్రత, తడి, పొడి చెత్త వినియోగం, ప్లాస్టిక్ కవర్ల నిర్మూలన, పర్యావరణ కాలుష్య నియంత్రణకు తీసుకోవాల్సి జాగ్రత్తలపై ప్రదర్శనలు ఇచ్చారు. మొక్కల పెంపకం, స్వచ్ఛ భారత్, ఘన వ్యర్థాల నిర్వహణకు చేయాల్సిన వివిధ రకాల కార్యకలాపాలపై, ఓడీఎఫ్ ప్లస్‌గా గ్రామాలను తీర్చిదిద్దడానికి చేయాల్సిన కార్యక్రమాలు, మిషన్ లైఫ్‌లోని అంశాలు, శబ్ద, వాయు, నీటి కాలుష్యాల నివారణకు, పర్యావరణ పరిరక్షణ తదితర విషయాలపై వీధి నాటికలు, పాటలు, హాస్య సన్నివేశాల ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ మేనేజర్, సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

పోలవరం రూరల్: పంచాయతీ పరిధిలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని కొత్తపట్టిసీమ సర్పంచ్ మైగాపుల విజయదుర్గ అన్నారు. పోలవరం మండలం కొత్తపట్టిసీమ పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. సిబ్బందికి పారిశుద్ధ్య పనులకు అవసరమైన సామగ్రిని అందజేశారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పెంచాలని, పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని విజయదుర్గ సూచించారు. గ్రామంలో ఉన్న చెత్తను తొలగించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

తిరుమలంపాలెం హైస్కూల్లో తనిఖీలు



విద్యార్థులతో మాట్లాడుతున్న విజయకృష్ణ

ద్వారకాతిరుమల: మండలంలోని తిరుమలంపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుడు వంటిపల్లి విజయకృష్ణ శనివారం పరిశీలించారు. వంటశాలలోని వసతులను, వంటకాలు, మంచినీటి సదుపాయాన్ని పరిశీలించారు. విద్యార్థులతో విడివిడిగా మాట్లాడి మధ్యాహ్న భోజన పథకం అమలు తీరు, ఆహార నాణ్యత, రుచి, మెనూ అమలు, నీటి లభ్యత, పరిశుభ్రత తదితర అంశాలపై ఆరా తీశారు. మంచి ఆహారాన్ని అందిస్తే విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటారని, చదువులో రాణిస్తారనే సంకల్పంతో ప్రభుత్వం చేపట్టిన ఈ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పాఠశాలలో నీటి శుద్ధి యంత్ర సామగ్రి వినియోగంలో లేకపోవడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు నివేదికను జిల్లా కలెక్టర్‌కి అందజేస్తానని విజయకృష్ణ తెలిపారు.

సీమంతాలతో నూతనోత్సాహం



కొయ్యలగూడెం : బోడిగూడెంలో గర్భిణులకు సామూహిక సీమంతం



ద్వారకాతిరుమల : ఎం.నాగులపల్లిలో సీమంతాలు నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: సామూహిక సీమంత కార్యక్రమాలు గర్భిణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపుతాయని బోడిగూడెం సర్పంచ్ కడకట్ల గడ్డియ్య పేర్కొన్నారు. ఐసీడీఎస్ శాఖ ఆధ్వర్యంలో బోడిగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక సీమంతం, పౌష్టికాహార మాసోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ ఎ.నయోమిరాణి మాట్లాడుతూ పౌష్టికాహారం తీసుకోవడంతో పాటుగా కనీస వ్యాయామం చేయాలని అన్నారు. గంటా సుబ్రమణ్యం, జక్కు శ్రీను, గంటా రమేష్, మెంటే రాజు, నీలం రాము, పేరుబోయిన పద్మ, అద్దేపల్లి పండు, జిల్లా కోఆర్డినేటర్ ఎన్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎం.నాగులపల్లిలో సీమంతాలు

ద్వారకాతిరుమల: మండలంలోని ఎం నాగులపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ కె.మణి తదితరులు గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. అనంతరం మణి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పౌష్టికాహారం తీసుకుని సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ నమోదులో ఇబ్బందులను తొలగించాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఇటీవల అప్డేట్ చేసిన స్టూడెంట్ అటెండెన్స్ యాప్‌లోనే విద్యార్థుల మార్కులను నమోదు చేసే అవకాశాన్ని పొందుపరచడం వల్ల మార్కులను మొబైల్ ఫోన్లోనే నమోదు చేయాల్సి వస్తోందని, కంప్యూటర్‌లో లేదా ల్యాప్‌టాప్‌లో నమోదు చేసే అవకాశం లేకపోవడం వల్ల ఉపాధ్యాయులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.రామారావు, బి.రెడ్డిదొర ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థి అన్ని సబ్జెక్టుల మార్కులు ఒకేసారి నమోదు చేసే అవకాశం లేకుండా ఒక సబ్జెక్టును ఎంచుకొని మార్కులు నమోదు చేసి, మరలా వెనక్కివచ్చి వేరొక సబ్జెక్టు మార్కులను నమోదు చేయాల్సి వస్తుందని, దీంతో ఒక్కో విద్యార్థి మార్కులు నమోదు చేయడానికి 20 నుంచి 30 నిమిషాల వరకు సమయం పడుతుందని వివరించారు. తరగతి ఆధారంగా కాకుండా గతంలో వలే సబ్జెక్ట్ ఆధారంగా ఆన్‌లైన్‌లో మార్కులు నమోదు చేసే అవకాశం కల్పించాలని కోరారు.